

మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

# కలిసికట్టుగా పనిచేయండి..

- రెడ్యా నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): అందరూ కలిసికట్టుగా పనిచేసి డోర్నకల్ బీఆర్ఎస్ అభ్యర్థి రెడ్యా నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబాబాద్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో డోర్నకల్ నియోజకవర్గం ముఖ్యనాయకులతో మంత్రి సత్యవతి రాథోడ్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అభివృద్ధే కనిపిస్తున్నదని, చేసిన మంచిని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ఇక కార్యకర్తల బాగోగులు చూస్తామని హామీ ఇచ్చారు. చిన్న చిన్న బేదాభిప్రాయాలు ఉంటే పక్కన పెట్టి, కలిసికట్టుగా పని చేద్దామని మంత్రి కార్యకర్తలకు ఉద్బోధించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు ఏ విధంగా లబ్ధి చేకూరిందనేది వివరించడమే కాకుండా ప్రతిపక్షాల ఆరోపణలు, విష ప్రచారాలు, విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం రాకముందు పరిస్థితి ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా ముందుకు సాగాలన్నారు. బీఆర్ఎస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఎంపీ, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు మాలోత్ కవిత, బీఆర్ఎస్ రాష్ట ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్ రెడ్డి, డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న, డోర్నకల్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాము

## జోరందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

దంతాలపల్లి, నవంబర్ 14: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారంలో జోరు పెంచారు. డోర్నకల్ బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మంగళవారం ఈ సందర్భంగా మండలంలోని దాట్ల గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, పెద్దముప్పారు జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, రామానుజపురంలో ఎంపీపీ వోలాద్రి ఉమా మాల్లారెడ్డి, ఆగపేటలో జిల్లా నాయకుడు గౌతమ్‌రెడ్డి, దంతాలపల్లిలో తొర్రూర్ మార్కెట్ డైరక్టర్ కిశోర్‌కుమార్, బీరిశెట్టిగూడెంలో పార్టీ మండలాధ్యక్షుడు ధర్మరాపు వేణు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి, రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు.

## వంటగ్యాస్ లీకై ముగ్గురికి తీవ్ర గాయాలు

లింగాలఘనపురం, నవంబర్ 14 : వంటగ్యాస్ లీకై ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కేమిడి చంద్రకళ దీపావళి సందర్భంగా హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు, కోడలు, కూతురు, అల్లుళ్లను పిలిపించుకుని పండుగ జరుపుకున్నారు. వంటింట్లో దేవుడికి దీ పాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వంటగ్యాస్ సిలెండర్ రెగ్యులేటర్‌లో లీకేజీ ఏర్పడి మంటలు వెలువడ్డాయి. ఈ ఘటనలో చంద్రకళ చిన్న కూతురు స్వప్న, పెద్ద అల్లుడు యాదగిరి, కోడలు సిద్దిలక్ష్మికి గాయాలయ్యాయి. పొరుగున ఉన్న రేగు శ్రీనివాస్ గమనించి సిలిండర్‌ను బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. బాధితులను సర్పంచ్ సాదం విజయమనోహర్, ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, ఉప సర్పంచ్ కేమిడి కవితావెంకటేశ్ పరామర్శించారు.

# నేను పక్కా లోకల్..

- కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతాం
- తెలంగాణలో ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్
- కురవిలో ఇంటింటా ప్రచారం



కురవి : సీరోలులో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి, నవంబర్ 14 : నేను పక్కా లోకల్.. తగ్గేదేలే.. అంటూ డోర్నకల్ ఎమ్మెల్యే కార్యకర్తల్లో హుషారెత్తించారు. ఆనవాయితీ ప్రకారం.. ఉమ్మడి కురవి మండల ఎన్నికల ప్రచారం.. చింతపల్లి శివారు కుమ్మరిబోడుతండా వద్ద అశేష జనం స్వాగతం పలకగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కోలాటం.. పూలచల్లుతూ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముఖ్యంగా యువత ముందుండి నడిపించారు. చింతపల్లి, రేకులతండా, రూప్లాతండా, సీరోలు, బిల్యాతండా, బూర్గుచెట్టుతండా, కాంపల్లి, ఉప్పరిగూడెం, గోపతండా, తాళ్లసంకీస గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రసంగించారు. తన రాజకీయ జీవితం మీరు పెట్టిన భిక్ష అన్నారు. మారుమూల నిరుపేద కుటుంబంలో పుట్టిన నన్ను మీరు ఈ స్థాయికి తీసుకువచ్చారన్నారు. మీ రుణం తీర్చుకోలేనిదన్నారు. మాట ఇస్తే తప్పకుండా.. మీలో ఒకనిగా పనిచేసుకుంటూ వచ్చానన్నారు. తను మీ వాడినని.. నేను పక్కా లోకల్ అన్నారు. రెండు జిల్లాల అవతల డాక్టర్ వృత్తి చేసుకుని డబ్బులు సంపాదించినోళ్లను తనపై నిలిపాడన్నారు. అసలు నియోజకవర్గంలో ఏ తండా ఎక్కడ ఉందో తెలుసా..? అని ప్రశ్నించారు. పోయిన ఎన్నికల్లో ఓడిపోయి అటే పోయినవు.. మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఓటు అడుతావన్నారు. ఎన్నికల కోసం వచ్చిపోయేవారి మాటలు నమ్మితే మోసపోతామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే చీకట్లో మగ్గిపోవడమేనన్నారు. ఒకరేమో మూడు గంటల కరెంట్ చాలు అంటున్నాడు.. మరొకరు రైతు బంధు అవసరమా అంటూ నిలిపివేయించారు.. వీరా రైతాంగాన్ని ఆదుకునేది ప్రజలు ఆలోచించాలన్నారు. రైతు కంట కన్నీరు రాకుండా చూసుకునే సీఎం కేసీఆర్ కావాలా.. ఓట్ల కోసం రైతులను కష్టపెట్టే కాంగ్రెస్ కావాలా ప్రజలు ఆలోచించాలన్నారు. మాట ఇస్తే తప్పే ముచ్చట లేదన్నారు. గతంలో మండల పర్యటనలో మాట ఇచ్చాను.. చింతపల్లి కింద రెండు నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయించానన్నారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో మాట ఇచ్చాను.. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి సీరోలును మండలం చేయించానన్నారు. మీకు ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉన్నానన్నారు. మీ అమూల్యమైన ఓటు వేసి దీవించాలని కోరారు. ప్రపంచంలో సీఎం కేసీఆర్ వంటి నాయకుడు లేడని.. రాడన్నారు. తాగునీరు సాగునీరు తెచ్చి సబ్బండ వర్గాలకు చేరువయ్యాడన్నారు. ఆసరా పెన్షన్ సృష్టికర్త సీఎం కేసీఆర్ అన్నారు. మళ్లీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ఆసరా పెన్షన్ దశలవారీగా ఐదువేలకు పెరుగుతాయన్నారు. కల్యాణలక్ష్మి పథకంతో పేదింటి ఆడపిల్లలు సంతోషంగా ఉన్నారన్నారు. కేసీఆర్ కిట్ వంటి పథకాలతో పేదోళ్లకు భరోసాగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ లేకుంటే కాళేశ్వరం పూర్తి అయ్యేదా.. మన డోర్నకల్‌కు నీళ్లు వచ్చేవా ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రజలంతా మూకుమ్మడిగా ఓటు వేసి ప్రతిపక్షాలకు డిపాజిట్ రాకుండా కారు గుర్తుకు ఓటువేసి హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని నిలబెట్టాలన్నారు. కేసీఆర్ తీసుకువచ్చిన మ్యానిఫెస్టోతో పేదోడికి నూరుశాతం న్యాయం జరుగుతుందన్నారు. రేషన్‌దారులకు సన్నబియ్యం, భూమిలేని నిరుపేదలకు రైతు బీమా తరహాలోనే ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం.. సౌభాగ్య లక్ష్మి.. వంటి పథకాలు పేదోళ్ల కోసమేనన్నారు. 400కే గ్యాస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాకు చివరి ఎన్నికలు అని.. ప్రజలంతా ఓటు వేసి గెలిపిస్తే మీకు సేవ చేసి మిగిలిపోయిన పనులను పూర్తి చేసి చరిత్రలో నిలిచిపోతానన్నారు. నాకు ఎటువంటి సంకోచం లేదని.. మీదయతో హ్యాట్రిక్ ప్రభుత్వం వస్తుందని మీ దయతో ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానన్నారు. ఎన్నికల కోసం మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ బండి వెంకట్ రెడ్డి, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, జిల్లా బజ్జూరి పిచ్చిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కో ఆర్డినేటర్ ముండ్ల రమేశ్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, సొసైటీ చైర్మన్లు గోవర్ధన్ రెడ్డి, గార్లపాటి వెంకట్ రెడ్డి, శ్రీదేవి, బోజు నాయక్, మల్లు రామచంద్రారెడ్డి, రంజిత్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, తోట రమేశ్, పెద్ది వెంకన్న, అనిల్, వీరన్న, చందూలాల్, బాలాజీ, రామచంద్రు, కవిత, శ్యామల రంగమ్మ, రవి, రాజు, శ్రీను, రామచంద్రయ్య, శంకర్, కిషన్, కళమ్మ, భిక్షమయ్య, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్సీ ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే..**

రాజకీయ కురువృద్ధుడు, సీరోలు గ్రామ మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకట్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే రెడ్యానాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీరోలు మండల ఏర్పాటులో కీలకభూమిక పోషించిన ఎమ్మెల్యేకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు.



ర్యాలీతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ప్రజలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

# నా బలగం.. బలం మీరే..

- ఆశీర్వదించండి మరింత అభివృద్ధి చేస్తా
- మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

దంతాలపల్లి, నవంబర్ 14: గత పదేళ్లుగా తనను ఆదరించి అభిమానిస్తూ గెలిపిస్తున్న నియోజకవర్గా ప్రజలే నా బలగం.. బలం అన్ని మహబుబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం దంతాలపల్లి మండలంలోని బొడ్లాడ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్న ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకం అందుతుందన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి మూడవ సారి భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్ని హామీ ఇచ్చారు. గ్రామానికి వచ్చిన శంకర్‌నాయక్‌కు మహిళలు హారతులు, పూలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుష్మా గౌడ్, ఎంపీటీసీ మధుసూధన్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాంచంద్రయ్య, రమేశ్, వెంకన్న, సుమన్, వెంకన్న, శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..

దంతాలపల్లి, నవంబర్ 14: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని డోర్నకల్ బీఆర్ఎస్ యువ నాయకులు డీఎస్ రవిచంద్ర అన్నారు. మండలంలోని వేములపల్లి, దొనకోడ గ్రామాల్లో కార్యకర్తలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. మూడో సారి బీఆర్ఎస్‌ను గెలిపించి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను కుర్చోబెట్టాలన్నారు. అనంతరం గున్నెపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కోడిమాల చంద్రమ్మ, చిల్లా సిద్దు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వొలాద్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ధర్మరాపు వేణు, సర్పంచ్‌లు వెంకటనారాయణ, ఉప్పలయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సుదాకర్, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న రవిచంద్ర